ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి



## ఎఐటియుసిలో భారీగా చేరికలు



మంచిర్యాల.. వార్త మెయిన్‌లో..

ఎడతెరిపిలేని వర్షాలు

# వాగులు పొంగిపొర్లాయి.. అస్తవ్యస్తం



శంకరపట్నం



ముత్తారం



నిర్మల్‌లో..

### తడిసి ముద్దయిన శంకరపట్నం ఆరకండ్ల వాగు పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలు బంద్

**ప్రజాపక్షం/శంకరపట్నం:** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని గ్రామాలు తడిసి ముద్దయ్యాయి. భారీ వర్షాలు కురుస్తుండడంతో మండలంలోని చెరువులన్నీ నిండుకుండలా తయారయ్యాయి. వివిధ గ్రామాలలో చెరువులకు గండి పడడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని అరకండ్ల వాగు పొర్లి పొంగడంతో శంకరపట్నం మండల గ్రామాలకు, వీణవంక మండల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు చోట్ల రోడ్ల మద కంచెలు వేసి అటువైపు ప్రయాణం చేయకూడదని ఎస్సై శేఖర్ రెడ్డి సూచిస్తున్నారు. ఇక భారీ వర్షాలు కురవడంతో బుధవారం రాత్రి మండలంలోని మొలంగూర్ గ్రామంలో జంపాల చిట్టిబాబు అనేక వ్యక్తి ఇల్లు కూలింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలో పరిస్థితిని తెలుసుకోవడానికి ఎంఆర్‌వో సంఘటన స్థలాలను పరిశీలించారు. అలాగే వర్షాలతో ఎంతవరకు నష్టం వాటిల్లిందో తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వర్షాలతో ప్రజలంతా చాలా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లవద్దని సూచనలు చేస్తున్నారు. అలాగే వ్యవసాయ బావుల దగ్గరికి వెళ్లే రైతులు చాలా జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. వర్షాలు విపరీతంగా కురుస్తుండడంతో బావుల దగ్గర మోటార్లు ఆన్ చేసేటప్పుడు జాగ్రత్తలు వహించాలన్నారు. పొడి చేతులతోనే స్విచ్ ఆన్ చేయాలన్నారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అన్ని విభాగాల అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు.



ధర్మపురిలో..

### అసత్య ప్రచారాలు నమ్మొద్దు : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** గంభీరావుపేట మండలం నర్మాల వద్ద నీటి ప్రవాహంలో గల్లంతు అయిన వ్యక్తి తేలుతూ తంగళ్లపల్లి మండలం సమీపంలోని కస్బెకట్కూర్ గ్రామానికి చేరుకున్నదనే సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారం సరికాదని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. మానేర్ నదికి అనుసంధానించబడిన అన్ని గ్రామాలను తాను, అధికారులు పరిశీలించారని పేర్కొన్నారు. అలాంటి మృతదేహం ఎక్కడా కనిపించలేదని కలెక్టర్ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ఇలా ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బయటికి రావద్దని కలెక్టర్ తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే కలెక్టరేట్ లోని కంట్రోల్ రూం ను సంప్రదించాలని సూచించారు.

### ఉధృతంగా మంథని గంగా నది.. పూర్తిగా మునిగిన శివలింగం

**ప్రజాపక్షం/ముత్తారం/మంథని :** రెండు రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు భారీగా చేరడంతో మంథని గంగనది ఉదృతంగా ప్రవహిస్తుంది. దీంతో గంట,గంటకి వరద నీరు పెరిగిపోతుంది. పెద్దపల్లి జిల్లా మంథని శ్రీ గౌతమేశ్వర దేవాలయం సమీపంలోని గంగ నది గురువారం మధ్యాహ్నం వరకు గోదారి(గంగ) సమీపంలో శివలింగాలు మునిగిపోయి గంట, గంటకు ఉదృతంగా వరదనీరు పెరిగిపోతుంది. ఇలాగే కొనసాగితే గోదావరి రాత్రి వరకు మరిన్ని నీళ్లు వచ్చే అవకాశం ఉంది.ఇప్పటికే గోదావరి పరివారం ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

# లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి : కమిషనర్ ప్రఫుల్లాదేశాయ్

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కురుస్తున్న భారీ వర్షాల పట్ల నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, సానిటేషన్ డిజాస్టర్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులతో సమీక్షించారు. వర్షాల నేపథ్యంలో నగరపాలక సంస్థ ద్వారా చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నగర ప్రజల రక్షణ తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎక్కడ వరద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా డిఆర్‌ఎఫ్ బృందాలు తగిన పరికరాలతో సిద్ధంగా ఉండి షిఫ్టుల వారీగా సహాయక విధులు నిర్వర్తించాలన్నారు. వరదలతో ప్రజలకు ఎక్కడ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్, సానిటేషన్, టౌన్‌ప్లానింగ్, డిజాస్టర్ అధికారులు అలర్ట్‌గా ఉండి విధుల్లో నిమగ్నం కావాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పట్ల వెంటనే స్పందించి




సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రధాన డ్రైనేజీల్లో సిల్ట్ తొలగింపు చర్యలు చేపట్టాలని, డ్రైనేజీలో ఫుట్‌పాత్ చాంబర్ల వద్ద చెత్త పేరుకుపోకుండా చూడాలన్నారు. యూజిడి చాంబర్లు శిథిలావస్థలో ఉంటే రిపోర్టు అందించాలన్నారు. వరద నీరు ఎక్కడా నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డివిజన్ల వారీగా డ్రైనేజీలను శుభ్రపరుస్తూ ప్లాస్టిక్ బాటిల్స్, కొబ్బరి బొండాలు, చెత్త చెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఎక్కడ ఇబ్బందులు తలెత్తినా నగరపాలక సంస్థకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ వేణుమాధవ్, ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈలు యాదగిరి, సంజీవ్ కుమార్, ఏసిపిలు వేణు, శ్రీధర్, డీఈలు, సానిటేషన్ సూపర్‌వైజర్లు, డిజాస్టర్ అధికారులు ఏఈలు, టిపిఎస్‌లు, టిపిబివోలు, సానిటేషన్ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

**ప్రజాపక్షం/ముత్తారం :** ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం రెవిన్యూ ఇన్స్పెక్టర్ నరీన్ పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి మానేరు వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ నరీన్ సాయి పట్టుకుని ముత్తారం పోలీస్ స్టేషన్ తరలించారు.ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని అన్నారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉచిత ఇసుక తరలింపు కోసం పర్మిషన్ ముత్తారం, అడవి శ్రీరాంపూర్ రీచ్‌ల నుండి మాత్రమే ఇసుకను తీసుకువెళ్లాలని ఆయన సూచించారు.

## బషీర్‌బాగ్ అమరులకు సిపిఐ నివాళి




**ప్రజాపక్షం/శంకరపట్నం:** మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో గురువారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య ఆద్వర్యంలో బషీర్‌బాగ్ విద్యుత్ ఘటనలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సంధర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ విద్యుత్ పోరాటంలో పోలీసు కాల్పుల్లో అమరులైన విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి, రామకృష్ణలకు జోహార్లు అర్పించారు. ప్రస్తుత ప్రభుత్వం వారిని గుర్తించి అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. మండల సహాయ కార్యదర్శి బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రేగుల కుమార్, కోశాధికారి లక్ష్మ ణ్, కార్యవర్గ సభ్యులు బూర్తుల శ్రీనివాస్, పిట్టల రామస్వామి, మార్కొండ నరసయ్య, సురేష్ కుమార్, మహేందర్ రెడ్డి తదితరులున్నారు.

## వ్యవసాయ సహకార సంఘం సిఇఓ బదిలీ

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సీఈఓ గా విధులు నిర్వహిస్తున్న దాసరి ప్రసాద్ గౌడ్ కమాన్ పూర్ మండలానికి బదిలీ అయినట్లు సంబంధిత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కమాన్ పూర్ సహకార సంఘం కార్యాలయంలో సీఈఓ గా పనిచేస్తున్న సంతోష్ ముత్తారం వ్యవసాయ సహకార సంఘం కార్యాలయానికి సీఈఓ గా రానున్నట్లు తెలిసింది.

## మోడల్ పాఠశాలలో ప్రవేశాలు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని దర్యాపూర్ మోడల్ పాఠశాల, కళాశాలలో ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశాల కోసం ఆఫ్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మాడల్ పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంతోష్ కేసరి తెలిపారు.పాఠశాలలో చేరాలనుకునే విద్యార్థులు సంబంధిత పత్రాల (స్టడీ, టిసి, ఆధార్ కార్డు) ను పాఠశాల,కళాశాల వద్ద సమర్పించి వీలైనంత త్వరగా ఆగస్టు 30 లోపు చేరాలన్నారు.బాలికలకు 9 వ తరగతి నుండి హాస్టల్ సౌకర్యం ఉంటుందన్నారు.మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

# ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా హుస్నాబాద్‌ను తీర్చిదిద్దుతాం



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** చిగురుమామిడి మండల కేంద్రంలోని రైతు వేదికలో పొన్నం సత్తయ్య గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సతీమణి పొన్నం మంజుల గౌడ్ చేతుల మీదుగా మండలంలోని 17 గ్రామైక్య సంఘాలకు స్టీల్ బ్యాంకు గురువారం అందించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా హుస్నాబాద్‌ను తీర్చిదిద్దాలని మహిళలను కోరారు. ప్రతి ఒక్కరు స్టీల్ పాత్రను వాడాలని చెప్పారు. స్టీల్ పాత్రలు వాడుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మహిళలపై ఉందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తలపెట్టిన ఈ యజ్ఞంలో అందరూ పాలుపంచుకుని ఆరోగ్యకరమైన తెలంగాణను నిర్మించాలని చెప్పారు. హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, తహసీల్దార్ ముద్దసాని రమేష్, ఎంపిడివో మధుసూధన్, అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవికుమార్, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ రజిత, మండల సమైక్య అధ్యక్షురాలు రజిత, ఓబిలు, సిసిలు, వివోఏలు, వివోఓబిలు, మహిళా సంఘాల సభ్యులున్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో ఎల్‌ఒసి అందజేత



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో రూ.3లక్షల ఎల్ఓసిని స్థానిక కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన పొగాకుల రమేష్ అనే వ్యక్తి కూతురు కడుపునొప్పితో బాధపడుతూ ప్రైవేట్ హాస్పిటల్‌లో చూపిస్తూ దాదాపు రెండు లక్షల రూపాయల వరకు ఖర్చు చేసినా జబ్బు నయం కాలేదు. పూర్తి వైద్య చికిత్స కోసం ఇంకా రూ.4లక్షల వరకు ఖర్చు అవుతాయని, ఆర్థిక స్థోమత లేక ఖర్చు భరించలేని బాధిత కుటుంబం స్థానిక కాంగ్రెస్ నాయకులను కలిశారు. ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి మూడు లక్షల ఎల్‌వోసి లెటర్‌ను ఇప్పించారు. అదే విధంగా పన్యాల అమృతవవ్వకు రూ.25 వేలు, వేల్పుల శ్రీనివాస్‌కు రూ.36 వేలు, సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సంధర్భంగా మంత్రి స్థానిక కాంగ్రెస్ నాయకులకు పొగాకుల రమేష్, బాధిత కుటుంబ సభ్యులు దన్యవాదాలు తెలిపారు. ఎల్‌వోసి లెటర్‌ను అందజేసిన వారిలో డిసిసి ప్రధాన కార్యదర్శి చిట్టుమల్ల రవీందర్, కాంగ్రెస్ మండల స్టీరింగ కమిటీ సభ్యులు గీకురు రవీందర్, గ్రామ అధ్యక్షుడు వంగ కనకయ్య, మండల సోషల్ మీడియా కో కన్వీనర్ బుర్ర శ్రీనివాస్, బెజ్జంకి అంజయ్య, కవ్వంపల్లి సంజీవ్ కుమార్, గడ్డం చందు తదితరులున్నారు.

## మంటపాల్లో డిజెలు, స్పీకర్లకు అనుమతులు లేవు..



**ప్రజాపక్షం/శంకరపట్నం:** గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని శంకరపట్నం ఎస్సై శేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గణపతి దర్శనంలో భాగంగా ఆయన మాట్లాడారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు మండపాల వద్ద చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద ఏర్పాటు చేసే లైట్లకు సంబంధించి విద్యుత్ తీగలు సరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. వర్షాకాలం కావడంతో విద్యుత్ విషయంలో సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సలహాలు తీసుకుంటూ జాగ్రత్తగా విద్యుత్ సరఫరా చూసుకోవాలన్నారు. మండపాల వద్ద సిసి కెమెరాల ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రాత్రి సమయంలో ప్రతి రోజు ఇద్దరు, ముగ్గురు నిర్వాహకులు ఉండాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దన్నారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వాట్సాప్‌లో గ్రూపు ఏర్పాటు చేయనున్నామని, అందులో నిర్వాహకులతో పాటు అన్ని విభాగాల అధికారులు ఉంటారని, ఏ సమస్య ఉన్నా అందులో సమాచారం ఇస్తే వెంటనే స్పందించడం జరుగుతుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిజెలకు, పెద్ద స్పీకర్లకు అనుమతి ఉండదని గుర్తుంచుకోవాలన్నారు. డిజెలు పెడితే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## యాదవ చారిటబుల్ ట్రస్టు కార్యవర్గం ఎన్నిక




**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఎన్నికను పూర్తి చేసినట్లు, ఎన్నికలలో 34 మంది సభ్యులకు గాను 31 మంది సభ్యులు ప్రత్యక్షంగా కార్యవర్గ ఎన్నికలో పాల్గొన్నారని ప్రధాన ఎన్నికల అధికారి నుచ్చు శ్రీనివాస్ యాదవ్, సహాయ ఎన్నికల అధికారి పడాల సత్యనారాయణ తెలిపారు. యాదవ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడిగా మారం తిరుపతి యాదవ్, ఉపాధ్యక్షుడిగా చిలారపు పర్వతాలు, ప్రధాన కార్యదర్శిగా గొడుగు రాజకొమురయ్య, ఉప కార్యదర్శిగా పర్ష బక్కయ్య, కోశాధికారిగా మేకల మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తమ్మడబోయిన ఓదెల యాదవ్ ను ట్రస్ట్ గౌరవాధ్యక్షుడిగా నియమించారు. ట్రస్టీలుగా గంట రాములు, సంధనవేని రాజేందర్, పెగడ రమేష్, ధారబోయిన నరసింహం, మేకల కొమురయ్య, సల్వాల సుమలత, తాత రాజు యాదవ్, మల్లెత్తుల నాగరాజులను ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికైన కార్యవర్గానికి గురువారం ఎన్నిక ధ్రువీకరణ పత్రాలను ప్రధాన ఎన్నికల అధికారి నుచ్చు శ్రీనివాస్ అందజేశారు. నూతనంగా ఎన్నికైన ట్రస్ట్ అధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ ఎన్నికకు సహకరించిన యాదవ సంఘం పెద్దలు గంట రాములు యాదవ్, తొట్ల తిరుపతి యాదవ్, యాదవ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ సందనవేని రాజేందర్ యాదవ్, సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## మాజీ మంత్రి కొప్పులకు ఆహ్వానం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం కేంద్రంలోని గంగపుత్ర యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను ఆహ్వానించారు.ఈ మేరకు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం కరీంనగర్ లోని వారి నివాసంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు .ఈ సందర్భంగా గణపతి నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానించగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సానుకూలంగా స్పందించారని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మాజీ ఉప సర్పంచ్ మారం రాజశేఖర్ ,నాగుల రాహుల్ ,ఎరవేణి రాహుల్, కాల్వ శ్రీనివాస్ ,నీలి శివకుమార్ పాల్గొన్నారు.

## కనకదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో దుర్గశరన్నవరాత్రోత్సవాలు

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** కనకదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో జరిగే నవమి దుర్గశరన్నవారాత్రోత్సవాలలో భాగంగా గురువారం రోజున వేదబ్రాహ్మణుల సమక్షంలో శ్రీమాన్ నంబి వేణుగోపాలచార్య కౌశిక ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ రూపకల్పనకు అంకురర్పాణ చేశారు. కనకదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో 2209 2025 నుండి 02102025 వరకు దుర్గశరన్నవారాత్రోత్సావాలు అష్టలక్ష్మి దేవాలయ ఆవరణలో అంగరంగ వైభవంగా జరుగనున్నాయని ఆలయ అధికారులు తెలిపారు. అమ్మవారు ప్రతి రోజు కోక రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నరని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవిందుల రాధాకృష్ణ, వేద పండితులు , మాతలు కనకదుర్గా సేవా సమితి కమిటీ సభ్యులు, కార్యకర్తలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## తహసీల్దార్‌ను కలిసిన నాయకులు

**ప్రజాపక్షం/గంగాధర:** గంగాధర మండల నూతన తహసీల్దార్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల నూతన బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ రజితను కాంగ్రెస్ నాయకులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గంగాధర మండలంలో ప్రజల సమస్యలను పరిష్కారానికి తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బూరుగు గంగన్న, పార్టీ సీనియర్ నాయకులు సత్తు కనకయ్య, దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గరికంటి కరుణాకర్, దీకొండ మధు, నాయకులు సాగి అజయ్ రావు, మంత్రి మహేందర్, మ్యాక వినోద్, కడారి కుమార్, తదితరులున్నారు.

## కుటుంబానికి ఆశ్రయం



**ప్రజాపక్షం/శంకరపట్నం:** శంకరపట్నం మండలంలోని మొలంగూర్ గ్రామంలోని జంపాల చిట్టిబాబు ఇల్లు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి కూలింది. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ సురేఖ సదరు ఇంటిని పరిశీలించి కూలీ చేసుకునే ఆ కుటుంబానికి రైతు వేదికలో ఆశ్రయం కల్పించారు. బాధితులకు తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు మోరె గణేష్ భోజన సదుపాయాలు కల్పించారు.

# అధిక వర్షాలతో స్తంభించిన జనజీవనం





**ప్రజాపక్షం/గంగాధరః** రాష్ట్రంలో ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ అవసరమైతే తప్ప రోడ్డు ప్రయాణాలు చేయవద్దని గంగాధర ఎస్సై వంశీకృష్ణ సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముంపునకు గురయ్యే రోడ్లు, వంతెనల మీదుగా ప్రయాణించవద్దన్నారు. తెగిపడిన విద్యుత్ తీగలు, కరెంటు స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే విద్యుత్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎత్తయిన ప్రదేశాల్లో ఫోన్‌లో మాట్లాడడం, చెట్ల కింద ఉండడం లాంటివి చేయవద్దన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించవద్దని, చేపలు పట్టడానికి, ఇతర అవసరాల కోసం చెరువులు, బావులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లరాదని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ పనుల కోసం బావులు, పొలాల్లోకి వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వినాయక మండపాల దగ్గర తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే డయల్ 100 చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.



**ప్రజాపక్షం/జమ్మికుంటః** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు హౌజింగ్ బోర్డు కాలనీ, అంబేద్కర్ కాలనీ, హరితనగర్, కృష్ణకాలనీ, ఆబాదీ జమ్మికుంట ప్రాంతాలలో గురువారం తహసీల్దార్ వెంకటరమణ, పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ సందర్శించారు. ఈ సంధర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ ముందు జాగ్రత్త చర్యలుగా బుధవారం రాత్రి నుంచి మున్సిపల్ శానిటేషన్ అధికారులు, సిబ్బంది పనిచేశారని తెలిపారు. రాబోయే మరో రెండు రోజులు అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముందుగానే శిథిలావస్థలో ఉన్న పలు ఇండ్లకు నోటీసులు ఇచ్చి కూల్చివేశామని, మిగిలిన మరికొన్ని శిథిలావస్థలోని ఇండ్లలోని వారు బంధువుల ఇంటికి, సురక్షితమైన ప్రాంతాలకు తరలివెళ్లాలని ఆయన సూచించారు. ఈ వర్షాల కారణంగా అంటువ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. మేనేజర్ జి.రాజిరెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారులు శ్రీధర్, మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్లు మహేష్, సదానందం, ఈఈ శ్రీకాంత్‌లు పలు వార్డులను పరిశీలించారు.

## రిజర్వాయర్‌ను పరిశీలించిన అధికారులు

**ప్రజాపక్షం/గంగాధరః** గంగాధర మండలంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నారాయణపూర్ రిజర్వాయర్, పలు లోతట్టు ప్రాంతాలను గురువారం అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ రజిత, చొప్పదండి సిఐ ప్రదీప్ కుమార్, స్థానిక ఎస్సై వంశీకృష్ణ, ఎంపిడివో దమ్మని రాము కలిసి లక్ష్మిదేవిపల్లి లోలెవల్ బ్రిడ్జి, నారాయణపూర్ రిజర్వాయర్ వద్ద పరిస్థితిని పరిశీలించారు. రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండిపోవడంతో ఉధృతంగా నీరు ప్రవహిస్తోంది. దీంతో గంగాధర బూరుగుపల్లి రహదారిలో లక్ష్మిదేవిపల్లె వద్ద ఉన్న లో లెవల్ బ్రిడ్జి వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి ప్రవాహం సాఫీగా సాగేందుకు బ్రిడ్జి కింద గల అనవసరపు మొక్కలను జేసిబి సహాయంతో తొలగించే పనులు వెంటనే చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలిచ్చారు. బూరుగుపల్లి ఎస్సీ కాలనీ లోతట్టు ప్రాంతాలలో పలు ఇళ్లలోకి నీరు చేరిన నేపథ్యంలో నీటిని మళ్లించే చర్యలు తక్షణమే చేపట్టాలని సంబంధించి పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రావద్దని సూచించారు. వరద కాల్వలో నీటి ప్రవాహం ఉధృతంగా కొనసాగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## వర్షపు నీరుతో అస్తవ్యస్తం.. అధ్వానం

**ప్రజాపక్షం/ముత్తారం :** ఎడతెరిపి లేకుండా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు గ్రామాల్లోని రోడ్లపై



వరద నీరు నిలిచి రోడ్లు కాస్త నీళ్లతో నిండుకొని కుంటలను తలపిస్తున్నాయి. కొన్నిచోట్లలో బురద గుంటలుగా ఉండి అస్త వ్యస్తంగా.. అధ్వానంగా పలు వీధులు ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్, ముత్తారం, హరిపురం, కేషనపల్లి తో పాటు తదితర గ్రామాల్లో సరియైన డ్రైనేజీలు లేకపోవడంతో పలు వీధుల్లోని రోడ్లపై వర్షపు నీరునిలిచి బురద గుంటలతో అస్తవ్యస్తం అధ్వానంగా మారింది. దీంతో గ్రామస్తులు వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆందోళన పడుతున్నారు.చిన్నారులు,వృద్ధులు, వాహనదారులు బయటకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

**హరిపురం బస్టాండ్ లో భారీగా చేరిన వరదనీరు :** ముత్తారం మండలంలోని హరిపురం గ్రామపంచాయతీ పరిధిలోని బస్టాండు లోకి వరదనీరు భారీగా చేరడంతో బస్టాండ్ అంతా వర్షము నీరుతో నిండిపోయింది. అలాగే గ్రామంలోని పలు వీధులు వర్షపు నీరు తో నిండిపోయి కుంటలను తలపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం డ్రైనేజీలు నిర్మించకపోవడమే అని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా మంత్రి శ్రీధర్ బాబు, సం బంధిత అధికారులు స్పందించి మండల వ్యాప్తంగా సమస్యలు ఉన్న గ్రామాల్లో డ్రైనేజీలు, సిసి రోడ్లు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అధిక వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** నిత్యం కురుస్తున్న అధిక వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సుల్తానాబాద్ ఎస్సై సిహెచ్ శ్రావణ్ కుమార్ తెలిపారు. గురువారం మండలం లో విస్తృతంగా పర్యటించిన అనంతరం మాట్లాడుతూ మానేరు పరివాహక ప్రాంతం ఉద్వితం గా ప్రవహిస్తుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ లోని లోయర్ మానేరు డ్యాం గేట్లు ఎత్తే అవకాశం ఉన్నందున మానేరు పరివాహక ప్రాంతంలో ఉన్న గ్రామల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలెవరు వాగు దాటే ప్రయత్నాలు చేయవద్దని రైతులు పొలాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని ఇసుక కొరకు ట్రాక్టర్ల ఓనర్లు,డ్రైవర్లు ఎవరు మానేరు వాగు లోకి వెళ్ళవద్దనిఅన్నారు. అలాగే చేపల వేటకు ఎవరు వెళ్లకూడదని బర్ల, గొర్ల మేకల కాపర్లు రైతు కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధిక వర్షాల ద్వారా ప్రాణ ఆస్తి నష్టాలు వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని శిథిల అవస్థలో ఉన్న ఇండ్లలో ఎవరు నివసించవద్దని మానేరు పరివాహక ప్రాంతం చుట్టుపక్కల ఉన్నవారు సురక్షిత ప్రాంతాలలో ఉండాలని సూచించారు.



ప్రజలు ఎవరు కూడా అత్యవసర పరిస్థితి అయితే తప్ప బయటకు రాకూడదని కోరారు.

# వరద ఉధృతికి రోడ్డు ధ్వంసం



**ప్రజాపక్షం / మల్లాపూర్ :** నిత్యం జగిత్యాల నుండి రాయికల్ మల్లాపూర్ మీదుగా నిర్మల్ వరకు వందలాది వాహనాలు ప్రయాణించే గొర్రెపల్లిలోని రోడ్డు భారీ వర్షానికి వరద ఉధృతితో ధ్వంసం అయింది. గత మూడు నాలుగు సంవత్సరాలుగా భారీ వరదలతో రోడ్డు ధ్వంసం అవుతున్న తాత్కాలిక మరమ్మత్తులు చేపడుతన్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని, ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు శాశ్వత పరిష్కారం చూపి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా గురువారం వరద ఉధృతితో గంటకు పైగా వాహనాలు రెండు వైపులా ఆగిపోగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

**ప్రజాపక్షం / మల్లాపూర్ :** వర్షాభావ పరిస్థితులు ఎక్కువగా ఉన్నందున వాగులు, వంకలు చెరువులు, కుంటలు నిండి వరద పోటెత్తుతుందని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఈ సందర్భంగా శ్రీరాం సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి వరద నీటి గోదావరి నదిలోకి వదలడంతో ఉధృతంగాప్రవహిస్తున్నందున వాల్గొండ గోదావరి నదిని అధికారులతో కలిసి పర్యవేక్షించారు. గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గొర్రెలు, బర్రెల కాపరులు, ప్రజలు గోదావరి వైపు వెళ్లకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ గోదావరి నది ఉధృతిని పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. వీరి వెంట జిల్లా పంచాయతీ రాజ్ అధికారి మదన్, సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, ఎస్సై రాజు, ఎమ్మార్వో రమేష్, ఎంపిడివో శశికుమార్ రెడ్డి, ఎంపివో



జగదీష్, పార్టీ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి సంది రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి గౌరు నగేష్, నాయకులు డీలర్ మల్లయ్య, నరేష్ రెడ్డి, శరత్ గౌడ్, లింగ స్వామి, రాజన్న, మైదాన్ శ్రీనివాస్, లక్ష్మి నర్సయ్య, సుతారి రాజేందర్, బాలరాజ్, వెంకట్ రెడ్డి, వినోద్ తదితరులు ఉన్నారు.

# విద్యుత్ అమరవీరుల త్యాగాలు వృథా కాలేదు..

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** విద్యుత్ అమరవీరుల త్యాగాలు వృథాకాలేదని సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కె కనకరాజ్ అన్నారు. గురువారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో జరిగిన విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ గోసిక మోహన్, కామ్రేడ్ గౌతం గోవర్ధన్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని ముందుగా అమరవీరుల స్థూపానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు ఆర్థిక విధానాలను అవలంబించోద్దని, కరెంటు చార్జీలను పెంచొద్దని రెండువేల సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వామపక్ష పార్టీలు చేసిన మహత్తర పోరాటం వల్ల నేడు కరెంటు చార్జీలు ఇంకా సామాన్యులకు అందుబాటులో ఉండటానికి కారణమని దాంట్లో అమరులైనటువంటి రామ




కృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి ల త్యాగం వృధా కాలేదని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో రైతులు వ్యవసాయం చేసుకోవడానికి కరెంటు లేకపోవడం, కరెంటు చార్జీలు పెంచడానికి ఆనాడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రయత్నం చేస్తే నాడు కమ్యూనిస్టు పార్టీలతో పాటు తొమ్మిది వామ పక్ష పార్టీలు ఇచ్చిన పిలుపునిందుకొని చలో అసెంబ్లీ కార్యక్రమానికి హైదరాబాద్ కు వేలాది మంది ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు వస్తె దానిని తట్టుకోలేని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరసనకారులపై గుర్రాలతో తొక్కించి పోలీసులతో కాల్పులు జరిపించాడని ఆ కాల్పుల్లో రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి లు మరణించడం చాలా బాధాకరమని ఇప్పటికైనా ఈ ప్రభుత్వాలు వారి అమరత్వాన్ని గుర్తించి వాళ్ళ కుటుంబాలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యుత్ రైతులకు అందుబాటులో ఉన్నది అని అంటే అది ఆనాడు కమ్యూనిస్టులు చేసిన పోరాటం వల్లేనని, కమ్యూనిస్టులు ఏం చేశారు అని అడిగే వాళ్లకు ఇదే ఒక సమాధానమని, అమరవీరులు చూపినటువంటి పోరాట స్ఫూర్తిని తీసుకొని రానున్న రోజుల్లో మరిన్ని పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్ళపెల్లి మల్లయ్య, మర్కా పూరి సూర్య, మడికొండ ఓదెమ్మ, జిల్లా కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ తొడుపునూరి రమేశ్ కుమార్, ఆసాల రమ, రేణుకుంట్ల ప్రీతం,నాయకులు అసల నవీన్,కల్వల జగన్ , సుందర్ రాజ్, రాజేశ్వర్ రావు నూకల మొండి,మంజుల,తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రదర్శన

**ప్రజాపక్షం/శంకరపట్నం:**రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో వార్డుల వారీగా డ్రాఫ్ట్ ఓటరు జాబితాతో పాటు డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాలను ప్రదర్శించారు. ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపై ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 30 లోగా మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని ఎంపిడివో కృష్ణ ప్రసాద్ తెలిపారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీలలో 240 వార్డులు ఉండగా పురుష ఓటర్లు 18650, మహిళా ఓటర్లు 19217, మొత్తంధ్గ 37867 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.

## దేవాలయ డైరెక్టర్ దంపతులకు సన్మానం



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** ఇటీవల ఓదెల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ డైరెక్టర్ గా ఎన్నికైన సుల్తానాబాద్ పట్టణానికి చెందిన సామల యమున హరికృష్ణ దంపతులను కాంగ్రెస్ పార్టీ నాయకులు సుల్తానాబాద్ జడ్పిటిసి ఆశవాహ అభ్యర్థి, పిఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు పడాల అజయ్ గౌడ్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా అజయ్ గౌడ్ మాట్లాడుతూ దేవాలయాలు మన ఆధ్యాత్మిక కేంద్రాలు మాత్రమే కాకుండా, గ్రామ అభివృద్ధికి, ఐక్యతకు ప్రతీకలు అని అన్నారు.ఈ కమిటీ ద్వారా దేవాలయం అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను అని తెలిపారు. ఆలయం అభివృద్ధి కి ఎల్లప్పుడూ అవసరమైన సహకారం అందించడానికి సిద్ధంగా ఉంటాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్డగుంట రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న సన్నిధిలో..

**ప్రజాపక్షం/వేములవాడ:** రాష్ట్ర మంత్రి అట్లూరి లక్ష్మ ణ్ కుమార్ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కోడె మొక్కులు చెల్లించారు. ఆలయకార్య నిర్వాహణాధికారి రాధాబాయి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. సహాయ కార్యనిర్వహణాధికారి జి.శ్రవణ్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ, టెంపుల్ పరిశీలకులు నూగూరి నరేందర్ తదితరులున్నారు.

## చాంపియన్ తానిపర్తి చికితాకు ఘనస్వాగతం



**ప్రజాపక్షం/సుల్తానాబాద్/పెద్దపల్లి :** వరల్డ్ ఆర్చరీలో మెరిసిన తెలంగాణ బిడ్డ గోల్డ్ మెడల్ సాధించిన ఛాంపియన్ తానిపర్తి చికితా కు తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు.మంత్రి శ్రీహరి మాట్లాడుతూ కెనడాలో నిర్వహించిన అండర్ 21 వరల్డ్ ఆర్చరీ ఛాంపియన్షిప్‌లో పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తానిపర్తి చికితా (20) గోల్డ్ మెడల్ సాధించడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని తెలంగాణ రాష్ట్ర క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.జూనియర్ విభాగంలో భారతదేశం తరపున స్వర్ణ పతకం సాధించిన మొదటి మహిళా ఆర్చర్‌గా చరిత్ర సృష్టించడం రాష్ట్ర ఎంతో మంది క్రీడాకారులకు స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ సందర్భంగా ఆమెను శాలువా కప్పి, పూలబొకేతో సన్మానించినట్టు చెప్పారు. పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే ఇంతటి గొప్ప విజయాన్ని సాధించడం రాష్ట్రానికీ, దేశానికీ గర్వకారణం అని అన్నారు.చికితా భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ క్రీడాకారులకు అండగా ఉంటుంది అని అన్నారు. పేదింటి రైతు బిడ్డ నుండి ప్రపంచ ఛాంపియన్‌షిప్ గోల్డ్ మెడల్ వరకు స్ఫూర్తిదాయక ప్రయాణం అని తెలిపారు.జూనియర్ విభాగంలో భారతదేశం తరపున తొలి మహిళా స్వర్ణ విజేతగా చరిత్ర సృష్టించిన చికితా పెద్దపెల్లి నియోజకవర్గ బిడ్డ కావడం మన అదృష్టమని తెలిపారు.పెద్దపెల్లి జిల్లా పేరును చాటి చెప్పిన చికితా కు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులు చి కి తాను ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 'ఆశ' వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించని పాలకులను పోరాటం ద్వారానే గుణపాఠం చెప్పాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా 5వ మహాసభ డిమాండ్ చేసింది. గురువారం స్థానిక ముకుందలాల్ మిశ్రాభవన్‌లో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా 5వ మహాసభ జరిగింది. ఈ మహాసభలో 32 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కాల్వ సారిక, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మారెళ్ల శ్రీలత ఎన్నికయ్యారు. గత 20 సంవత్సరాలుగా వైద్యరంగంలో కీలకంగా పనిచేస్తున్న ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం అన్యాయమన్నారు. రాబోయే రోజుల్లో స్కీమ్ వర్కర్లను కలుపుకుని కార్మిక హక్కుల కోసం కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ, ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, ప్రమోషన్స్, అన్ని రకాల సెలవులు, గ్రాట్యుటీ కోసం తీర్మాణాలను మహాసభలో ప్రవేశపెట్టారు. ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్‌లు హాజరై మాట్లాడారు. శ్రామిక మహిళను ప్రభుత్వాలు గౌరవించడం లేదన్నారు. శ్రామిక హక్కును లేబర్ కోడ్స్ ద్వారా హరించారన్నారు. రాత్రి షిఫ్టుల్లో మహిళల చేత రాత్రి 9 నుంచి ఉదయం 7 గంటల వరకు పనిచేయాలని షరతులు విధించడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ స్కీమ్ నిధులను తగ్గించి ప్రైవేట్ వారికి అప్పగించి క్రమంగా మూసివేయాలని చూస్తోందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. లేని పక్షంలో మోసపూరిత వైఖరిని ఎండగట్టాలని కోరారు. నూతన అధ్యక్షులుగా కాల్వ సారిక, జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత, జిల్లా కోశాధికారిగా రామగిరి రాజమణి, ఉపాధ్యక్షులుగా లత, రజిత, సహాయ కార్యదర్శిగా లక్ష్మి , పద్మ, సత్య లక్ష్మి , సరిత ఆఫీస్ బేరర్స్‌గా కమిటీ సభ్యులుగా ప్రియాంక, రజిత, పుష్పలత, కవిత, సుమలత, సరోజన ఎన్నికయ్యారని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత తెలిపారు.

## నియామకం పట్ల కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు బిసి విధ్యార్థి సంఘం జాతీయ కో ఆర్డినేటర్ డాక్టర్ అరుణ్ బాబు, బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి సూచనల మేరకు బిసి యువజన సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా నరాల శ్రీకాంత్‌ను నియమించారు. ఈమేరకు బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ నియామక ఉత్తర్వులు అందజేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర నాయకులు ,జిల్లా నాయకులకు నరాల శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, బిసి హక్కుల సాధనకై పోరాడుతానని పేర్కొన్నారు.

## కేంద్రం నిర్వాకం వల్లే యూరియా కష్టాలు

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** రాష్ట్రంలో రైతులకు అవసరమైన యూరియాను అందించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఎమ్మార్పీఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గంగాధర నరేష్ తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా గురువారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ వానకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా రైతులు నెల రోజులుగా యూరియా కోసం రోడ్లమీదకు వచ్చి నిరసన తెలుపుతున్నారని పేర్కొన్నారు.కృత్రిమ కొరత పేరుతో బిజెపి చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఇప్పటికైనా రాష్ట్రానికి కావాల్సిన యూరియాను తెప్పించడానికి బిజెపి ఎంపీలు కేంద్రమంత్రులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అండగా నిలబడాలని వారు కోరారు. రాష్ట్రానికి 9.80 లక్షల టన్నుల యూరియా అవసరముండగా కేంద్రం లక్షన్నర టన్నులు తగ్గించిందని, కేటాయించిన కోటా ను కూడా సకాలంలో సరఫర చేయకపోవడంతో తీవ్రమైన యూరియా కొరత ఏర్పడిందని వారు తెలిపారు. రైతులు సహకార సంఘాలు దుకాణాల ముందు పడి కాపులు కాస్తున్నారని కొన్ని చోట్ల తొక్కిసలాటలు కూడా జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీనుంచి రాష్ట్రానికి యూరియా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిన కేంద్రం ఉద్దేశపూర్వకంగా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. కొరత కారణంగా బ్లాక్ మార్కెట్లోకి యూరియా వెళ్తుందని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎంపీలు కేంద్ర మంత్రులు బాధ్యతగా ప్రకటించిన యూరియా తక్షణమే సరఫరా అయ్యేలా చూడాలని వారువిజ్ఞప్తి చేశారు.

# అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయొద్దు

**ఎమ్మార్వో వైదుర్దీన్, ఎంపిడివో చౌడారపు గంగాధర్**

**ప్రజాపక్షం / సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలో భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో గురువారం మేడారం తండా రేచపల్లి, లచ్చక్కపేట గ్రామాల్లోని శివారులోని బ్రిడ్జిలను ఎమ్మార్వో వైదుర్దీన్, ఎంపిడివో చౌడారపు గంగాధర్ పరిశీలించారు. మండల కేంద్రంలోని బతుకమ్మ కుంట మత్తడి తెగిపోయింది.అనంతరం మత్తడిని పరిశీలించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లోని బ్రిడ్జిపైనుండి నీరు ప్రవహించడంతో వాహనదారులు ఎవరూ దాటవద్దని సూచించి అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని అన్నారు. కరెంట్ స్థంభాలు వైర్లను ముట్టుకోవద్దని, ప్రజలు బయటకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు. సారంగాపూర్ గ్రామంలోని గొల్లపల్లి హనుమండ్లు, సూరమ్మ ఇండ్లు వరద నీటిలో మునిగిపోయి తీవ్రంగా దెబ్బతిన్న ఇండ్లను వారిని పరామర్శించి వారికి నిత్యవసర సరుకులు అందజేసిన ఎమ్మార్వో, ఎంపిడివో. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేషం, నాయకులు రామచంద్రా రెడ్డి, రాజేందర్ రెడ్డి, ఏఈ ఫారెస్టు అధికారులు, సిబ్బంది, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.



# వరద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ

**ప్రజాపక్షం / సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన గ్రామ మాజీ సర్పంచ్ గుర్రాల రాజేందర్ రెడ్డి గురువారం వరద బాధిత కుటుంబానికి నిత్యవసరాలతో పాటు నగదు ఆర్థిక సహాయాన్ని అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. బుధవారం సాయంత్రం నుండి గురువారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి మండల కేంద్రంలోని పదమటి వాడ, మరికొన్ని వాడల్లో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. దీంతో గ్రామానికి చెందిన గొల్లపల్లి హనుమండ్లు ఇంట్లోకి భారీగా వరద నీరు చేరడంతో సర్పంచ్, గ్రామస్థులు వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. వరద ముంపు తో నిరాశ్రయులైన కుటుంబానికి మాజీ సర్పంచ్ గుర్రాల రాజేందర్ రెడ్డి తన స్వంత ఖర్చులతో 25కిలోల సన్న బియ్యం, నిత్యవసరాలతో పాటు ఒక వెయ్యి రూపాయలు నగదు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో సారంగాపూర్ మండల పరిషత్ మాజీ ఉపాధ్యాక్షులు కొండ్ర రామచంద్రారెడ్డి, ఉప సర్పంచ్ ఏలూరు గంగారెడ్డి, గ్రామ కార్యదర్శి ప్రేమలత, గ్రామ ప్రముఖులు గడ్డం మల్లారెడ్డి, పెద్దిరెడ్డి గంగారెడ్డి, తూకూంట్ల పూర్ణచందర్ రెడ్డి, కాలగిరి సాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గడ్డిమందు తాగి వ్యక్తి మృతి

**ప్రజాపక్షం / సారంగాపూర్ :** సారంగాపూర్ మండలం లచ్చక్కపేట గ్రామానికి చెందిన తోట మహేష్(37) అనే వ్యక్తి తేది 23.08.2025 రోజున మద్యం తాగిన మైకంలో తన ఇంటి వద్ద వ్యవసాయ పనుల నిమిత్తం తెచ్చుకున్న గుర్తు తెలియని గడ్డి మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. శరీరంలోని అవయవాలు క్షీణించడంతో జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించినట్లు మృతుని భార్య తోట రజిత పిర్యాదు చేయగా, మృతుని భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి. గీత తెలిపారు.

## బయటకు రావొద్దు..

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి**



**ప్రజాపక్షం / ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండలంలోని కొండాపూర్ రామలక్ష్మ ణపల్లి ఆవునూరు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాగు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని అన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలు ఒక పక్క ఆనందం, మరో పక్క విషాదంగా ఉన్నాయని, కావున రైతులు, పశువుల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని, పొలాల వద్దకు వెళ్లినప్పుడు విద్యుత్ తీగలను గమనిస్తూ ఉండాలని అన్నారు. గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు, కరెంట్ సంబంధించి పనులు చాలా జాగ్రత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జల రాజు, మాజీ ఎంపిటిసి గుండెల్లి శ్రీనివాస్ గౌడ్, మండల ఉపాధ్యాక్షులు తాడెపు కొమురయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ తాళ్ల విజయ్ రెడ్డి, సోషల్ మీడియా మండల కన్వీనర్ ఎదునూరి భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

# పోతారం రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి వై .యాకయ్య**

**ప్రజాపక్షం/ముత్తారం/మంథని :** గోదావరి నది వరద ఉధృతి వలన మంథని మండలంలోని పోతారం గ్రామంలోని రైతుల పొలాలు నీట మునిగి పంట పొలాలు పూర్తిగా దెబ్బ తినడం జరిగిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వై యాకయ్య అన్నారు.గురువారంసిపిఎం పార్టీ నాయకులతో కలిసి నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. గోదావరి వరద ప్రభావంతో పోతారం ఉప్పట్ల గ్రామాలకు చెందిన వేలాది ఎకరాల రైతుల భూములు పూర్తిగా మునిగిపోయి పంటలు చెడిపోయినాయని అన్నారు. ఇక్కడ పంట పొలాలను చూస్తే సముద్రముల తలపిస్తుందని అన్నారు. పొట్ట కచ్చిన పంట నీటి పాలు కావడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు జరిగిన పంట నష్టం విషయంలో ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెంటనే స్పందించి రైతాంగాన్ని ఆదుకోవాలని గోదావరి నది ఒడ్డున కరకట్ట నిర్మాణం చేయాలని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రెవెన్యూ వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి పంట నష్టాన్ని అంచన వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బూడిద గణేష్, మంథని లింగయ్య, తోపాటు పోతారం రైతులు తదితరులు పాల్గొన్నారు.



## ఓటరు జాబితాను సవరించుకోవచ్చు

**స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధం**



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** గ్రామపంచాయతీలో ఓటర్ లిస్టు జాబితాను ప్రదర్శించారు. తప్పులుంటే సవరించుకోవచ్చుని ఇఒ ప్రవీణ్‌కుమార్ అన్నా రు. గురువారం స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగానే గ్రామపంచాయతీ ఆవరణలో ఓటర్ లిస్టు జాబితాను గోడకు అంటించి ప్రదర్శించినట్లు ఇఒ పేర్కొన్నారు.

# నీటి ప్రవాహం ఉన్నచోట రోడ్డు దాటొద్దు




**ప్రజాపక్షం / ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండల పరిధిలో కురుస్తున్న అతి భారీ వర్షాల నేపథ్యంలో ముస్తాబాద్ ఎస్సై గణేష్ ప్రజలకు పలు సూచనలు చేశారు. అవసరంగా ఎవరూ బయటకు రావొద్దు అని అన్నారు. వాగులు, వంకలు పొంగే అవకాశం ఉన్నందున ఎవరూ కూడా నీటిప్రవాహం ఉన్నచోట రోడ్డు దాటరాదన్నారు. రోడ్డుపైన వాహనాలు నడిపేవారు వర్షానికి రోడ్లు స్కిడ్ అయ్యే అవకాశం ఉన్నందున జాగ్రత్త వహించాలని అన్నారు. కరెంటు వైర్లు ఎలక్ట్రిక్ స్థంభాలను తాకరాదన్నారు. రైతులు పొలాల వద్దకు వెళ్లినప్పుడు స్టార్టర్లను నేరుగా తాకకుండా జాగ్రత్త వహించాలని, చాలా చోట్ల రోడ్డు బ్లాక్ అయ్యాయని, ప్రయాణికులు గమనించాలన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు.



## మానవత్వం చాటుకున్న మాజీ ఉపసర్పంచ్

**ప్రజాపక్షం/కెరమెరి :** కెరమెరి మండలంలో రెండు రోజుల నుండి అతి భారీ వర్షాలకు గోందుగూడా గ్రామపంచాయతీ పరిధిలోని ఇందాపూర్ వెళ్లే దారి మధ్యలోని బ్రిడ్జిపై నుండి నీరు ప్రవాహం వెళ్లడంతో ఆ నీటి ప్రవాహానికి బ్రిడ్జి యొక్క సగభాగం కొట్టుకుపోవడం జరిగింది. ఈ విషయాన్ని ఆ గ్రామ ప్రజలు బిఆర్ఎస్ నాయకులు, ధనోరా గ్రామ పంచాయతీ మాజి ఉప సర్పంచ్ సయ్యద్ అబ్దుల్ రిజ్వాన్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో ఆయన తన సొంత ఖర్చులతో మట్టి వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లాల్షా, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. రిజ్వాన్ యొక్క సేవ భావానికి ఆ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## గ్రామపంచాయతీలో ఓటర్ల జాబితా ప్రచురణ

**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ :** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నిక అధికారి జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ విభాగం ఆదేశాల మేరకు రెండో విడత సాధారణ ఎన్నికలు నిర్వహించుటకు గాను మండల పరిషత్ కార్యాలయంలో, మండలంలోని ఎల్కపల్లి, చేడ్వాయి, ఎల్లూర్, కొండపల్లి, బొబాయిగూడ, లోడ్పల్లితో పాటు పన్నెండు గ్రామపంచాయతీలో గ్రామపంచాయతీ ముసాయిదా ఓటర్ల జాబితా వార్డుల వారీగా ప్రచురించడం జరిగిందని గ్రామ పంచాయతీల కార్యదర్శులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మి నారాయణ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు జయశ్రీ, చంద్రశేఖర్, రాకేష్, నరేష్, శ్రీకాంత్, శ్రీధర్, మధుకర్, గణేష్, కిష్టయ్య, సిబ్బంది అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే పవార్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/బైంసా :** ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు భారీ వర్షం కురుస్తున్నప్పటికీ ఎస్.ఎస్.జిన్నింగ్ ఇండస్ట్రీ జనసంద్రమైంది.ఉదయం వేళ మండలాల్లో గ్రామాల వారీగా బిజెపి కార్యకర్తలు తమ అభిమాన నేత ఆయు ఆరోగ్యాలతో ఉండాలని ఆలయాల్లో పూజలు నిర్వహించారు.అనంతరం ముధోల్ మండలంలోని అష్ట గ్రామంలో బిజెపి నాయకులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.రెండు సంవత్సరాల్లో సిరాల ప్రాజెక్టు పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించారని,ఆయన సేవలను ఎప్పటి గుర్తించుకుంటామని బిజెపి మండల నాయకులు సిరాల ప్రాజెక్ట్ వద్ద ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.అదేవిధంగా బైంసా లోని ఎస్.ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ లో 30 మందికి పైగా అభిమానులు రక్తదానం చేశారు.బైంసా లోని లక్ష్మి వెంకటేశ్వర ఆలయంలో మహాదేవ్ మందిరల్‌లో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ పట్టణ బిజెపి నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అభిమానులు,బిజెపి సీనియర్ నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్యం, మరమ్మతు పనులు తక్షణం చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** భారీ వర్షాల నేపథ్యంలో పారిశుధ్యం, అత్యవసర మరమ్మత్తు పనులను తక్షణమే చేపట్టాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లాలోని రెబ్బెన మండలం ఎన్‌టిఆర్ కాలనీని తహసీల్దార్ సూర్యప్రకాష్‌తో కలిసి సందర్శించి వర్షం కురిసినప్పుడు వరద నీరు కాలనీలోకి చేరుతున్న ప్రదేశాలను, వరద పరిస్థితులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షం కురిసినప్పుడు కాలనీలో నిర్మించిన మురుగు కాలువలలో కూడిక లేకుండా శుభ్రపర్చాలని, ఎక్కడ మరమ్మత్తు పనులు చేపడితే కాలనీలోకి వరద నీరు రాకుండా ఉంటుందో గుర్తించి అత్యవసరంగా పనులు చేపట్టాలని తెలిపారు. కాలనీవాసులతో మాట్లాడుతూ కాలనీలో వరద నీటి సమస్య తీరేందుకు చేపట్టవలసిన పనులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వట్టివాగు డి కాలువ వద్ద కూడిక తీయించాలని నీటిపారుదల శాఖ అధికారికి సూచించారు. కాలనీలో అవసరమైన మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టాలని, అవసరమైన నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన వినాయకున్ని పూజించారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన తహసీల్దార్ సూర్య ప్రకాష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రచ్ రూమ్, బైక్ షెడ్లను ప్రారంభించిన ఏరియా జిఎం



**ప్రజాపక్షం / మందమర్రి :** మందమర్రి ఏరియాలో పని చేసే మహిళా ఉద్యోగుల సౌకర్యార్థం క్రచ్ రూమ్, బైక్ షెడ్లను గురువారం ఏరియా జిఎం జి. దేవేందర్ ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎఐటియుసి గుర్తింపు సంఘం ఏరియా వైస్ ప్రెసిడెంట్ భీమనాథని సుదర్శనం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ, మహిళా ఉద్యోగుల సౌకర్యాల కోసం ఎఐటియుసి చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. పిల్లల కోసం క్రచ్ రూమ్‌లో ఆట వస్తువులు, బెడ్లు ఏర్పాటు చేశామన్నారు. మహిళా ఉద్యోగులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని సమయపాలన పాటించాలని సూచించారు. క్రచ్ రూమ్, బైక్ షెడ్ల నిర్మాణానికి రూ.20 లక్షల పైచిలుకు ఖర్చయిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎఐటియుసి నాయకులు జిఎం, సివిల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం విజయప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ పటేల్, సివిల్ అధికారి రాములు, సీనియర్ పిఒ బొంగుని శంకర్, అధికారుల సంఘం నాయకుడు రమేష్, ఏరియా ఇంజనీర్ జాయ్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ భూశంకరయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఏఐటియుసి స్ట్రక్చర్ కమిటీ సభ్యులు సివి. రమణ, సృజన గీతిక, జ్యోతి, జలది, శ్రీనివాస్, లక్ష్మ ణ్ తదితరులు హాజరయ్యారు.

# మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘంలో కొత్త సభ్యుల చేరిక



**ప్రజాపక్షం/హాజీపూర్ :** మంచిర్యాల జిల్లా కాంట్రాక్టు కార్మిక సంఘంలో హాజీపూర్ విలీన గ్రామాలకు చెందిన పలువురు మున్సిపల్ కార్మికులు చేరారు. సంఘ గౌరవ అధ్యక్షులు సుద్ధమల్ల హరికృష్ణ సంఘంలో చేరిన వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ, విలీన గ్రామాల కార్మికులకు ప్రతినెలా 5వ తేదీలోపు వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంచిర్యాల కార్పొరేషన్ కార్మికులకు చెల్లిస్తున్న రూ.17,500 వేతనంతో సమానంగా వీరికీ గౌరవ వేతనం ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించి, కార్మికులకు రావాల్సిన అన్ని హక్కులను సాధించేందుకు తమ సంఘం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన కమిటీ అధ్యక్షులు చిప్పకుర్తి అశోక్, ఉపాధ్యక్షులు మిట్ట సంపత్, ఆత్మకూరి మల్లేష్‌తో పాటు మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శ్యామ్ కుమార్, క్యాషియర్ ఆవుల శ్రీనివాస్, 40 మంది కార్మికులు పాల్గొన్నారు.

# నిర్మల్‌లోని ప్రదీప్ న్యూరో హాస్పిటల్లో అరుదైన చికిత్స

### అత్యంత క్లిష్టమైన నరాల వ్యాధి నిర్ధారణ
### రోగికి సంపూర్ణ ఉపశమనం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని ప్రదీప్ న్యూరో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు వైద్య చరిత్ర లోనే అత్యంత అరుదైన, క్లిష్టమైన ఒక కేసును విజయవంతంగా పరిష్కరించారు. సాధారణంగా ఫిట్స్ కేసులు పెద్ద నగరాలలోని కార్పొరేట్ ఆసుపత్రులలో కూడా సరైన రోగ నిర్ధారణకు నోచుకోని సందర్భంలో,నిర్మల్‌లో ఈ కేసును గుర్తించి చికిత్స అందించడం వైద్యరంగంలో ఒక అద్భుత ఘట్టం దేశ విదేశాలలో అంతు చిక్కని వ్యాధి విదేశాలలో అకౌంట్ అఫీసర్‌గా పనిచేస్తున్న 43 ఏళ్ల వ్యక్తి గత ఒక నెల రోజులుగా నిరంతరం ఫిట్స్ సమస్యతో బాధపడుతున్నారు.రోజుకు 510సార్లు ఫిట్స్ రావడంతో ఆయన ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా మారింది,విదేశాలలో,అలాగే హైదరాబాద్‌లోని ప్రముఖ కార్పొరేట్ హాస్పిటల్స్‌లో లక్షల రూపాయలు ఖర్చు చేసినా,ఆయన వ్యాధి ఏమిటో ఎవరూ నిర్ధారించలేకపోయారు.సరైన రోగనిర్ధారణ లేకపోవడంతో సరైన చికిత్స కూడా అందించబడలేదు.దీంతో ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర నిరాశలో మునిగిపోయారు.చివరి ఆశగా వారు నిర్మల్‌లోని ప్రదీప్ న్యూరో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆశ్రయించారు.

**డాక్టర్ మనోజ్ భరత్ నైపుణ్యం :**
అరుదైన అంటీ ఎల్జీఐ 1 ఎన్‌సెఫలైటిస్ గుర్తింపు ఆసుపత్రిలో కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ మనోజ్ భరత రోగి యొక్క సమగ్ర ఆరోగ్య చరిత్రను పరిశీలించి,క్షుణ్ణంగా పరీక్షలు నిర్వహించారు.ఫిట్స్ యొక్క విలక్షణ లక్షణాలను బట్టి ఇది అత్యంత అరుదైన ఆంటీఎల్జీఐ1 ఎన్‌సెఫలైటిస్ అనే వ్యాధి అయి ఉండవచ్చని ఆయన అనుమానించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా 2025 లక్షల మందిలో కేవలం ఒక్కరికే వచ్చే వ్యాధి అని,దీనిని గుర్తించడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియ అని వైద్య నిపుణులు తెలిపారు.
డాక్టర్ మనోజ్ భరత్ నిర్ధారణ కోసం అవసరమైన సిఎస్ఎఫ్(Cerebrospinal Fluid)సీరమ్ నమూనాలను బెంగళూరులోని ప్రత్యేక ప్రయోగశాలకు పంపించారు.పరీక్షల ఫలితాలు ఆయన అనుమానాన్ని ధృవీకరించడంతో, వెంటనే తగిన చికిత్సను ప్రారంభించారు.
కేవలం రెండు రోజుల్లోనే రోగికి ఫిట్స్ పూర్తిగా ఆగిపోయాయి. ఈ అద్భుతమైన స్పందన రోగి ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడుతుందని సూచిస్తోంది. తమ ప్రాణాలను కాపాడిన వైద్యుడికి రోగి వారి కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కేసు నిర్మల్ వైద్య రంగం యొక్క సామర్థ్యాన్ని,నైపుణ్యాన్ని నిరూపించింది.

## ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటించిన ఎంపిడిఒ

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** కాగజ్‌నగర్ పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిడిఒ కోట ప్రసాద్ ఆధ్వర్యంలో 28 గ్రామ పంచాయతీలకు సంబంధించిన వార్డుల వారి ముసాయిదా ఫోటో జాబితా, ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి విడుదల చేసిన ఎన్నికల షెడ్యూల్ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ముసాయిదా జాబితాను ప్రకటించడం జరిగిందన్నారు. అదేవిధంగా మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో సంబంధిత పంచాయతీ కార్యదర్శులు ఓటరు జాబితాను ప్రచురించడం జరిగిందని, ఓటర్ల జాబితాలో ఏమైనా అభ్యంతరాలు, సందేహాలు, ఆక్షేపణలు ఉన్నచో ఈనెల 30 వరకు లిఖిత పూర్వకంగా పంచాయతీ కార్యదర్శులకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు సోయబ్, అస్లం, కంప్యూటర్ ఆపరేటర్లు, ముబిన్ పాషా, కాటం స్వామి, విద్యాసాగర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## సిఐ,ఎస్ఐలను సన్మానించిన బౌద్ధ సంఘం నాయకులు

**ప్రజాపక్షం/వాంకిడి :** భారతీయ బౌద్ధ మహాసభ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సంఘం నాయకులు మంగళవారం వాంకిడి మండల సిఐ సత్యనారాయణ, ఎస్ఐ దుర్గం మహేందర్‌లను సన్మానించారు. వాంకిడి మండల సిఐ సత్యనారాయణ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ప్రజలతో మమేకమై అనేక కేసుల్లో తనదైన శైలిలో పరిష్కరించినందుకు గాను సన్మానించినట్లు బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కర్ అన్నారు. అదేవిధంగా వాంకిడి మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన దుర్గం మహేందర్‌ను సైతం కలిసి స్వాగతం పలికి సన్మానించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభకు చెందిన బౌద్ధ గురూ బంతే భరద్వాజ్, మండల భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ సంఘం దుర్గం దుర్గాజి, సంయుక్త కార్యదర్శి రోషన్ ఉప్రే, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి ప్రతిమలతో పర్యావరణ పరిరక్షణ

### ఎమ్మెల్యే కోవలక్ష్మి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** మట్టి ప్రతిమలను ప్రతిష్టించడంతో పర్యావరణ పరిరక్షణకు పాటుపడిన వాళ్లం అవుతామని ఎంఎల్ఎ కోవలక్ష్మి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయక పంపిణి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పద్మశాలీలు ప్రతి సంవత్సరం మట్టి వినాయకులను ఉచితంగా పంపిణి చేసి పర్యావరణన్నా సంరక్షించడంలో పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు. అదే విధంగా వివేకానంద చౌక్‌లో వాసవి క్లబ్, లయన్స్ క్లబ్ సభ్యులు అంబేద్కర్ చౌక్ వద్ద మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ప్రతిమలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అనుమాండ్ల శ్రీకాంత్, అల్లె శ్రీకాంత్,సంఘం నాయకులు లింగయ్య, ధర్మయ్య, వాసవి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పాత శ్రీనివాస్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి రూ.55వేల విరాళం

**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** ఖానాపూర్ మండలంలోని గోసంపిల్ల గ్రామంలో ముక్తినాథ వైద్యనాదేశ్వరాలయ స్వామి ఆలయ నిర్మాణం కోసం ఆ గ్రామానికి చెందిన ఇసారపు రాజు,నవీన్ సోదరులు విరాళం అందించారు.బుధవారం గ్రామంలోని తమ నివాసంలో 55వేల నూట పదహారు రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.ఆలయ నిర్మాణానికి తమ వంతు ఆర్థిక సహాయం చేసిన దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.గ్రామస్థులు,ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.



## భారీ వర్షంతో నీట మునిగిన పంటలు

**ప్రజాపక్షం/కంటాల :** మండలవ్యాప్తంగా బుధవారం రాత్రి ప్రారంభమైన వర్షం గురువారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది.వర్షపు నీటిలో చెరువులు,కుంటలు నిండాయి.ఇండ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. పత్తి, సోయా పంట పొలాలు నీట మునిగాయి. కల్లూరు నుండి అందకూర్,కుంటాల నుండి అంబకంటి, మధ్యగల రోడ్లు కోతకు గురయ్యాయి. వర్షపు వరద ఉధృతితో అందకూర్ అలుగు వేగంగా ప్రవహించడంతో ఆ ప్రాంతంలోని రోడ్డు కోతకు గురై,రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.ప్రభుత్వం స్పందించి, వ్యవసాయ అదికారులను క్షేత్రస్థాయికి పంపించి పంట నష్టంపై విచారణ జరిపి పంట నష్టం జరిగిన రైతన్నలను ఆదుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన రైతులు కోరారు. వరద ప్రభావిత ప్రాంతాలను తహసిల్దార్ కమల్ సింగ్, ఎంపీడీవో వనజ పరిశీలించారు.



## ఝరి (బి) గ్రామాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి

ప్రజాపక్షం/తానూర్ : మండలంలోని ఝరి(బి) గ్రామంలో గురువారం భారీ వర్షాల కారణంగా వంతెన పైనుండి వరద నీరు ప్రవహిస్తుండటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి,సందర్శించి ఈ విషయాన్ని జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు చేరవాణి ద్వారా తెలుపడం జరిగింది.ఈ బ్రిడ్జ్ యొక్క నిర్మాణ పనులు ఇంతకుముందే పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కు కలిసి,లెటర్ ద్వారా తెలుపడం జరిగిందని,త్వరలోనే నూతన బ్రిడ్జి టెండర్ ప్రాసెస్ అయేలా చూస్తానని ఇంచార్జ్ మంత్రి మాజీ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే వెంట జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సాగర్ బాయి రాజన్న,మాజీ ఆత్మ చైర్మన్ పోతారెడ్డి,కుబీర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాథోడ్ అరుణ్ కుమార్,ఏఎంసి మౌల ఖాన్ ,డైరెక్టర్ దేవిదాస్,ఆసం మాధవ్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ముంపు పాపం ఎవరిది?

### నాయకులదా, అధికారులదా, ప్రజలదా..?



**ప్రజాపక్షం/నిర్మల్ :** ప్రతి వర్షాకాలంలో మాదిరిగానే ఈసారి కూడా నిర్మల్ పట్టణం వరదలతో అతలాకుతలం అవుతోంది. కుండపోత వర్షానికి మంచిర్యాల్ చౌరస్తా (శివాజీ చౌరస్తా), డాక్టర్స్‌లైన్స్, శాంతినగర్, జి.ఎన్.ఆర్ కాలనీ, గ్రాయత్రిపురం, రాంనగర్,బంగాల్‌పేట్ వంటి ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ దుస్థితికి ప్రధానంగా పాలకులు,అధికారుల తప్పేనని ప్రజలు తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు.

**అండర్ డ్రైనేజీ హామీ నీటిమూటలే..** పట్టణ విస్తరణకు అనుగుణంగా మౌలిక వసతులు అభివృద్ధి చెందకపోవడం నిర్మల్ ముంపుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. గతంలో మంత్రిగా ఉన్నప్పుడు,నిర్మల్‌కు శాశ్వత పరిష్కారంగా అండర్ డ్రైనేజీ వ్యవస్థను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ హామీలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి.సరైన మురుగునీటి పారుదల వ్యవస్థ లేకపోవడం,ఇప్పటికే ఉన్న కాలువలు చెత్తతో నిండి మూసుకుపోవడం వల్ల వర్షపు నీరు బయటకు వెళ్లడం లేదు.మున్సిపల్ అధికారులు పట్టణ ప్రణాళికలో సరైన పర్యవేక్షణ ప్రణాళికలో సరైన పర్యవేక్షణ చేపట్టకపోవడం,మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచకపోవడం వల్ల ఈ సమస్యలు తలెత్తుతున్నాయి.

**మాజీ మంత్రి,ప్రస్తుత ఎమ్మెల్యే పై ఆరోపణలు..?** గత మాజీ మంత్రి,వారి అనుచరులు అనుమతి లేకుంఆ టౌన్ షిప్ లేఅవుట్స్ చేయడంతో,సహజంగా నీరు ప్రవహించే ప్రాంతాలు మూసుకుపోయాయి.ఇది ముంపునకు ఒక ప్రధాన కారణం.గత మాజీ మంత్రి చేసిన తప్పిదాలనే ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యే కూడా చేస్తున్నారని విమర్శలు లేకపోలేదు.లోతట్టు ప్రాంతాలు వరదల బారిన పడతాయని తెలిసినా,అక్కడ గృహ నిర్మాణాలు విరివిగా జరుగుతున్నాయి.ఇది నష్టం అధికం కావడానికి దారితీస్తుంది.

**పాలకుల నిర్లక్ష్యం..** నిర్మల్ ముంపునకు ప్రధాన కారణం పాలకుల తప్పేనని ప్రజలు గట్టిగా నమ్ముతున్నారు.చెరువుల కబ్జాలను నిలువరించడంలో,ముంపు ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవడంతో శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలుఉ పూర్తిగా విఫలమయ్యాయి.పాలకుల చిత్తశుద్ధి లోపం వల్లనే నిర్మల్ పట్టణం ప్రతి వర్షాకాలంలో ఇలా మునుగుతూనే ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సమస్యకు శాశ్వత పరిష్కరం దొరకకపోతే,ప్రతి వర్షాకాలంలోనూ ఇదే దుస్థితి పునరావృతమవుతుందని వారు హెచ్చరిస్తున్నారు.

# నిర్మల్ జిల్లాను కుమ్మేసిన వరుణుడు

### కుండపోత వర్షాలతో అంతటా అతలాకుతలం

### జిల్లాలో సగటు వర్షపాతం 133 మి.మీ.

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా వ్యాప్తంగా వరుణ దేవుడు కుమ్మేశాడు.బుధవారం రోజు మొదలుకొని గురువారం వరకు అల్పాపీడన ప్రభావంతో జిల్లా అంతటా కుండపోత వర్షం కురిసింది.గురువారం జిల్లా మొత్తంలో 2527.4మి, మీటర్ల వర్షం కురువగా,సగటు 133.మి,మీ, వర్షపాతం నమోదైంది.నిర్మల్ పట్టణ పరిధిలో 332.8 మి.మీ,నిర్మల్ మండలంలో 332.4 మి.మీ, లక్ష్మణచాంద 218.6,సోన్ 208.4,సర్సాపూర్ జి 202.6,సారంగాపూర్ 187.2,కుంటాల 165.4,దిలావర్పూర్ 1644,లోకేశ్వరం 125.2,దస్తూరాబాద్ 115.4,ఖానాపూర్ 80.8,మామడ 78.4,కడెం 74.4,పెంబి 51.4,బైంసా 44.6,ముధోల్ 39.2,తానూర్ 38.2,బాసర 38,కుబీర్ 10మి,మీటర్లు కురిసింది.భారీ వర్షాలతో వాగులు,వంకలు పొంగిప్రవహిస్తుండగా,చెరువులు పూర్తి స్థాయిలో నిండుకున్నాయి.పల్లె,పట్టణాల్లో తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో మురికి కాలువలు పొంగి ప్రవహిస్తుండడంతో పారిశుధ్య సమస్యలు నెలకొన్నాయి.

**భారీగా నీట మునిగిన పంట పొలాలు..**
జిల్లా వ్యాప్తంగా భారీగా కురుస్తున్న వర్షాలు అనే పద్యంలో పంట పనులు నీటిలో మునిగి ఇసుకమెట్టలు పెట్టడంతో తీవ్ర స్థాయిలో పంట నష్టం జరిగింది.ఇప్పటికిప్పుడు సర్వేలు తేలేకపోయినప్పటికీ జిల్లాలో కురుస్తున్న వర్షానికి మరింత పంటలకు నష్టం కలిగించే అవకాశం లేకపోలేదు.రైతును అడగాలం పండించిన పంటలు నీట ముంపుకు గురైనప్పుడల్లా రైతులు కన్నీటిపర్వతం అవుతున్నారు.

# వర్షంలోనూ పారిశుధ్య పనులు చేపట్టిన సిబ్బంది

### నిరంతరం పర్యవేక్షిస్తున్న ఈఓ అన్వర్ అలీ

**ప్రజాపక్షం/ముధోల్ :** గడిచిన రెండు రోజుల నుండి భారీ వర్షాలు కురుస్తున్న పారిశుధ్య సిబ్బంది గ్రామస్వచ్ఛత కార్యక్రమాలను చేపట్టారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగొద్దని వారు ప్రజలకు నిరంతర సేవలు అందిస్తున్నారు.స్థానిక గ్రామ పంచాయతీ ఈఓ అన్వర్ అలీ వారి వెంటే ఉంటూ పారిశుధ్య సిబ్బందికి సలహాలు,సూచనలు అందిస్తున్నారు.వర్షాకాలం అవడం దోమల బెడద ఉండకుండా నీరు ఎక్కడా నిలుకుండా అందరికీ అవగాహన కల్పిస్తున్నారు.అదేవిధంగా వినాయక ఉత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రతి వినాయక మండపాల వద్ద తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి మార్గం చూపుతున్నారు.తన స్వంత డబ్బులతో ఆయా వినాయక మండపాల పూజ సామాగ్రిని అందించారు.అందుకుగాను మండల కేంద్రంలోని కిషోర్ గణేష్



సమితి వారు ఆయన్ను సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవలందించడానికి తాము ఎల్వేవేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు.గ్రామ స్వచ్ఛతకై తాము,తమ సిబ్బంది అహర్నిశలు పాటుపడుతున్నామన్నారు.భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రమాదకర ప్రదేశాల వద్ద వెళ్ళొద్దని పేర్కొన్నారు.ఏమైనా సమస్యలుంటే తమను సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది.తదితరులు పాల్గొన్నారు.



## భారీ వర్షాలకు ఉప్పొంగిన వాగులు,వంకలు

**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** నిర్మల్ జిల్లాను భారీ వర్షాలు ముంచెత్తాయి.గత మూడు రోజులుగా భారీ వర్షాలతో జిల్లాలోని మండలాలు,గ్రామాలోని వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం ఖానాపూర్ టు తర్లపాడ్ మధ్యలో రోడ్డుపై వరద ఉధృతంగా ప్రవహించడంతో మండల కేంద్రానికి పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించి వరదతో వాగులను తలపించాయి రోడ్లు,పాత ఎల్లాపూర్ నుంచి బీర్నంది గ్రామానికి వెళ్ళే మార్గంలోని చింతొర్రే క్యాజ్, వే పైనుంచి వరద ఉప్పొంగి ప్రవహించడంతో ఎర్వచింతల్,బీర్నంది,రంగపేట,కొలాంగూడ గ్రామాలకు సుమారు రెండున్నర గంటలు రాకపోకలు నిలిచిపోయాయి.ఈ క్రమంలోనే బీర్నంది గ్రామంలోని శ్రీరామ్ నగర్ కాలనీలోని ఇళ్లను వరదలు చుట్టుముట్టాయి. ఎర్వచింత గ్రామంలోని బల్లివాగుకు ఎగువ నుంచి అధిక వరద రావడంతో వాగు ఉప్పొంగి బ్రిడ్జి అంచులను అంటుకుని వరద ఉధృతితో ప్రమాదకరంగా ప్రవహించింది. ఈ నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండరాదని,భారీ వర్షాలు కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.దీంతోపాటు వ్యవసాయ పంటలు సైతం నీటమునిగి నష్టానికి గురయ్యాయి.పలు గ్రామాల్లో ఇళ్లు కూలిపోగా ప్రభుత్వం ఆదుకొవాలని బాధితులు కోరుతున్నారు.



## వర్షానికి కూలిన ఇల్లు

**ప్రజాపక్షం/సోన్ :** నిర్మల్ జిల్లా అంతట ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని న్యూ వెల్మల్ గ్రామానికి చెందిన బొడ్డు సురేంద,బొడ్డు శ్రీనివాస్ లు నివాసం ఉంటుంన్న ఇల్లు గురువారం కూలిపోయినవి.వెంటనే స్పందించిన గ్రామ కార్యదర్శి భూపాల్ రెడ్డి సిబ్బందితో వారిని వెంటనే ప్రాథమిక పాఠశాలకు తరలించారు.కూలిన సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడం వల్ల ఎవరికి ఏమి కాలేదు.దాదాపు 5 లక్షల వరకు నష్టం జరిగిందని ఇంటి యజమానులు వాపోయారు.ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలని దీనంగా వేడుకున్నారు.

## వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన మజీ మున్సిపల్ చైర్మన్,కౌన్సిలర్లు

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మండలంలో వర్ష ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం,మాజీ కౌన్సిలర్ సభ్యులు,ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు పట్టణంలోని జెకె నగర్,హైటెక్ సిటీ,గోదావరి నది తీరం వద్ద అదే విధంగా పలు వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించామని ఖానాపూర్ తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజు సత్యం అన్నారు. ఈ సందర్భందా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎవరు కూడా అత్యవసర పరిస్థితిలు ఉంటే తప్ప బయటకు రాకూడదని,అలాగే మత్స్యకారులు,పశువుల కాపర్లు,చేపలకు వేటకు వెళ్లేవారు ఎవరు కూడా నదులు వాగుల వద్దకు వెళ్లకూడదని అలాగే ఏవైన పాత ఇంటి నిర్మాణాలు కూలిపోయే స్థితిలో ఉంటే అందులో నివాసము ఉంటున్న వారు వేరే గృహాలకు వెళ్లాలని,లేదంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అధికారులు చర్యలు చేపడుతున్నారని,ఏవైనా ఇబ్బందులు ఉంటే మున్సిపల్ అధికారులకు తెలియజేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు షబ్బీర్ పాషా,సలీమ్ ఖాన్,శేషాద్రి,చింతపండు రవి,వెంకట్ మహేంద్ర,పలు కాలనీ వాసులు అధికారులు పాల్గొన్నారు.



# ఉప్పొంగిన గాండ్ల పేట్ పెద్దవాగు

**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని గాండ్లపాడు గ్రామంలోని పెద్దవాగులో నీరు పొంగిపొర్లుతున్నాయి. మోర్తాడ్ మండలంలో మంగళవారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షం వల్ల ఆయా గ్రామాలలోని చెరువులు, కుంటలు వర్షపు నీటితో నిండి పరవళ్లు తొక్కుతూ గాండ్లపేట్ పెద్దవాగులో కలవడంతో గాండ్లపేట్ పెద్దవాగు జాతీయ రహదారిపై బ్రిడ్జికి అతి సమీపం నుంచి నీటి ప్రవాహం వెళ్లడం వల్ల వాగు వద్ద ఎటువంటి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అక్కడ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్దవాగు సమీపానికి ప్రజలు ఎవరిని రానివ్వకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పెద్దవాగు ప్రవాహం వల్ల గాండ్లపేట్ వాగు సమీపంలోని పంట పొలాలు నీటిలో మునిగాయి. దీంతో రైతులకు అపార నష్టం వాటిల్లు



తుందని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ తుపానుల ప్రభావం వల్ల కురుస్తున్న వర్షాల వల్ల మోర్తాడ్ మండలంలోని ఆయా గ్రామాలలో గల చెరువులు , కుంటలు నిండి నిండుకుండలా కనబడుతున్నాయి.

## ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు.. నీటమునిగి పంటలు

ప్రజాపక్షం/కోటగిరి : నిజామాబాద్ జిల్లా కోటగిరి, పోతంగల్ మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో వందల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. వర్షాలు పడే అవకాశం ఇంకా ఉండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతాలు, పలు ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అవసరం ఉంటే ప్రజలు ఎవరూ బయటకు రావద్దని అధికారులు సూచించారు.

## భారీ వర్షానికి తెగిన కుంటలు రోడ్లు

ప్రజాపక్షం/అల్లాదుర్గం : గత వారం రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు అల్లాదుర్గం బిట్ల కుంట గండిపడి రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీటి ఉధృతికి రాకపోకలు నిలిచిపోగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జాయింట్ కలెక్టర్ నాగేష్ గండిపడ్డ చెరువును పరిశీలించి ఇరిగేషన్ అధికారులకు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించిన విషయం విధితమే అయిన మంగళవారం బుధవారం అతి భారీ వర్షం కురవడంతో మండలంలోని ఆయా గ్రామాల రోడ్లు కుంటలు తెగిపోయి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొగా అల్లాదుర్గం ఎస్సై వరద ప్రవాహాన్ని పరిశీలించి ప్రజలు వరదల్లో వెళ్లకుండా భారీ కేడ్లు జాలి ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉండాలని రాకపోకలు నిలిపివేశారు. కాగితంపల్లి కమ్మరి కుంట తెగిపోగా అప్పాజీపల్లి, అప్పాజీపల్లి తండా, నీలకంటి పల్లి సీతానగర్ గొల్ల కుంట తండా, భారీ వర్షానికి రోడ్లు తెగిపోయి తీవ్ర ఇబ్బందులకు గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. గత కొన్ని రోజుల క్రితమే జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించిన అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆయా గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరారు.

## భారీ వర్షాలపై ఎంపి అరవింద్ ఆరా

ప్రజాపక్షం/నిజామాబాద్ : జిల్లాలో బుధవారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలపై ఎంపీ అరవింద్ ధర్మపురి ఆరా తీశారు. ఆకస్మాత్తుగా వచ్చిన భారీ వర్షాలపై జిల్లా కలెక్టర్ సీపీలతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో వర్ష ప్రభావం తీవ్రంగా ఉందని, చాలా గ్రామాలు నీటమునిగిపోయిన విషయాలను ఆయన కలెక్టర్, సీపీ దృష్టికి తీసుకెళ్లారు. వినాయకచవితి పండగ సెలవు దినమైనప్పటికీ, అధికారులు, బాధ్యతతో పని చేశారని, రానున్న రెండు రోజులు జిల్లాకు రెడ్ అలర్ట్ ఉన్నందున ఇదే స్పూర్తితో బాధ్యతలు నిర్వహించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరద బాధితులను సమీపంలోని పునరావాస కేంద్రాలకు తరలించి కనీస సౌకర్యాలు అందించాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే అధికారులు ఆస్తి, పంట నష్టంపై నివేదిక అందజేసి నష్టపరిహారంపై ప్రభుత్వానికి నివేదికలు అందజేయాలని కోరారు. నష్టపరిహారంపై తాను కూడా సిఎంకు లేఖ రాస్తానని, హోంశాఖకు సైతం నివేదిస్తామన్నారు.

# భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజాపక్షం/నిర్మల్ : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని,అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు.గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడిన కలెక్టర్,అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇళ్ల నుండి బయటకు రాకూడదని కోరారు.శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్నవారు.లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించామని తెలిపారు.ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే కలెక్టరేట కంట్రోల్ రూమ్ నంబరు 9100577132 ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.ప్రాజెక్టులు,చెరువులు పూర్తిస్థాయిలో నిండిపోవడంతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయని,ప్రజలు లోతట్టు పరిసరాలకు వెళ్లరాదని,మత్స్యకారులు,పశు కాపరులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.వర్షాల కారణంగా దెబ్బతిన్న పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు.రోడ్లు,వంతెనలు దెబ్బతిన్న ప్రాంతాల్లో తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాట్లు చెప్పారు.లక్ష్మణచందా మండలంలోని మునిపల్లి గ్రామంలో వాగు అవతల్లి వైపు చిక్కుకుపోయిన శంకర్ అనే పశువుల కాపరిని ఎన్డీఆర్ఎఫ్ బృంధాల సహకారంతో సురక్షితంగా రక్షించగలిగామని కలెక్టర్ వివరించారు.

ఈ విలేకరుల సమావేశంలో డిపిఆర్ఓ విష్ణువర్ధన్,ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# తడిసి ముద్దైన బాల్కొండ నియోజకవర్గం

ప్రజాపక్షం/భీమ్‌గల్ : వరద ప్రాంతాలలో పర్యటించిన ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా వరదప్రాంతాలలో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని ప్రజలందరిని అప్రమత్తంగా ఉంచాలని ఆర్మూర్ సబ్ కలెక్టర అబిగ్యాన మాల్వియా అధికారులకు సూచించారు.గురువారం నాడు ఆయన వరద ప్రాంతాలను పర్యటించారు.కప్పలవాగు ఉధృతంగా ప్రవహిస్తుందన్న అధికారుల సమాచారం మేరకు ఆయన భీమ్‌గల్‌లో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు.

మండలంలో ఎక్కడైన ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకరావాలన్నారు. గత రెండు రోజుల నుండి కురుస్తున్న ఎడతెరిపిలేని వానలతో బాల్కొండ నియోజకవర్గంలోని చాలా మండలాలు తడిసి ముద్దయ్యాయి.ఎగువన కురుస్తున్న వర్షాలతో ఒక్కసారిగా వచ్చిన వరద నీటితో భీమ్‌గల్ మండలంలోని కప్పలవాగు ప్రమాదస్థాయిని దాటి ప్రవహించింది దీంతో భీమ్‌గల్ నుండి బడాభీమ్‌గల్ రహదారి తెగిపోవడంతో రహదారిని పోలీసులు ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా మూసివేశారు.భీమ్‌గల్ నుండి వేల్పూర్ రహదారిని సైతం వేల్పూర పోలీసులు మూసేశారు.భీమ్‌గల్ పట్టణంలోని కప్పలవాగు పక్కనే ఉన్న అబ్కారి కార్యాలయం వరద నీటిలో మునిగిపోయింది.ఆ సమయంలో ఆ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సిబ్బంది అక్కడే ఉండిపోయారు.దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న సిఐ సత్యనారయణగౌడ్,మున్సిపల్ కమీషనర్ గంగాధర్,తాశీల్దార్ షబ్బీర్,ఎంపిడివో సంతోష్ కుమార్ వారిని బయటకు తీసుకరావడానికి చాలా శ్రమపడ్డారు.స్థానిక గజీతగాళ్ళ సహయంతో వారిని క్షేమంగా బయటకు తీసుకవచ్చారు.ఎస్ఐ సందీప్ అధ్వర్యంలో కప్పలవాగు వద్ద పికెటింగ్ ఏర్పాటు చేశారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మంత్రులు

### నష్టపోయిన అందరిని ఆదుకుంటాం
### రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి



ప్రజాపక్షం/రామాయంపేట : గత రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల వల్ల దెబ్బతిన ప్రాంతాల్లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిలు గురువారం రామాయంపేట మండలంలో వేర్వేరుగా పర్యటించారు. ఉదయం మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యటించగా సాయంత్రం మరోమంత్రి వివేక్ వెంకటస్వామి స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతలతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా వారు రామాయంపేట పట్టణంలో జలదిగ్బంధంలో ఉన్న ప్రాంతాలను పరిశీలించి నష్టపోయిన ప్రతి ఒక్కరిని ఆదుకుంటామని ప్రజలకు భరోసా కల్పించారు. ఈసందర్భంగా మంత్రులు మాట్లాడుతూ బారీ వరదల్లో చిక్కుకున్న 60మందిని జిల్లా విపత్తు నిర్వహణ సిబ్బంది, రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కాపాడినట్లు తెలిపారు. మరో ఘటనలో ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారని అందులో ఒకరి మృత దేహం లబించిందని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతరం వరదలపై పర్యవేక్షిస్తున్నారన్నారు. ప్రభుత్వం పూర్తి అప్రమత్తతతో ఉందన్నారు. జిల్లాకు చెందిన ప్రభుత్వ యంత్రాంగం ప్రజలను కాపాడే పనిలో నిమగ్నమై ఉందన్నారు. వారి వెంట అడిషనల్ కలెక్టర్ నగేష్, నాయకులు ఆంజనేయులుగౌడ్, సుప్రబాత్‌రావు, రమేష్‌రెడ్డి, సరాపు యాదగిరి, గజవాడ నాగరాజు, దేమె యాదగిరి, బండారి మహేందర్‌రెడ్డి, కుమార్‌సాగర్, హన్మంతరావు, అమరసేనారెడ్డి, తహశీల్దార్ రజనికుమారి, ఎంపిడివో షాజిలోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# నందిగామ వద్ద హైవే రోడ్డు కుంగిన కల్వర్టును పరిశీలించిన మంత్రి

ప్రజాపక్షం/నిజాంపేట్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనానికి మండల పరిధిలోని గ్రామాలలో చెరువు కుంటలు రోడ్లు తెగిపోవడంతో అధికారులు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రోడ్లను పరిశీలించారు. మండల పరిధిలోని నందిగామ వద్ద నేషనల్ హైవే 765 రోడ్డు కల్వర్టు కుంగి నందున రామాయంపేట సిద్దిపేట రోడ్డు రాకపోకలు బుధవారం నుండి బంద అయినాయి. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజా నరసింహ వచ్చి రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా రెండు రోజులు తుఫాను ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరం ఉన్నట్లయితేనే ఇండ్లలో నుండి బయటకు రావాలని లేకుంటే ఇండ్లలోనే ఉండాలని ప్రజలకు సూచించారు. తుఫాను తాకిడికి ఎవరైనా ఇండ్లను కోల్పోయినట్లయితే వారికి ఇందిరమ్మ ఇల్లు తప్పకుండా ఇస్తామని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ప్రజలకు తగిన విధంగా సహాయ సహకారాలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు, మహిపాల్ రెడ్డి, నిజాంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, నార్లాపూర్ మాజీ సర్పంచ్ అమర సేనా రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసిల్దార్ రమ్యశ్రీ, ఎస్సై రాజేష్, ఎంపీడీవో రాజిరెడ్డి, ఏఈ బిక్షపతి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ హిమాద్, ప్రీతి, టిపిసిసి కార్యదర్శి సుప్రభాత రావు రమేష్ రెడ్డి, అజయ్, యూత్ అధ్యక్షులు రామచందర్, ఆకుల బాలయ్య, శ్రీనివాస్, ముత్యం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్, ఆయాల సస్పెండ్

ప్రజాపక్షం/శివ్వంపేట : చిన్నారులు అస్వస్థతకు కారణమైన రత్నాపూర్ అంగన్‌వాడీ టీచర్ పల్లె నవీన, ఆయా రాజమణి ఇద్దరిని జిల్లా కలెక్టర్ విధుల నుంచి సస్పెండ్ చేశారు. రత్నాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నర్సాపూర్ సీడీపీఓ హేమభార్గవి గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ఈ నెల 23న నిర్లక్ష్యంగా విధులు నిర్వహించి సుందెలుక పడిన నీటిని 8 మంది చిన్నారులకు అందించిన అంగన్‌వాడీ టీచర్, ఆయా అందించడంతో అస్వస్థతకు గురైన చిన్నారులను తల్లిదండ్రులు హుటాహుటిన నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించిన విషయం విధితమే. గ్రామస్థుల అభిప్రాయం తెలుసుకున్నామని, నిర్లక్ష్యపు సిబ్బంది మాకొద్దని తప్పకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారని ఆమె తెలిపారు. ఘటనను తీవ్రంగా పరిగణించి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రత్నాపూర్ అంగన్‌వాడీ టీచర్ నవీన, ఆయా రాజమణిని సస్పెండ్ చేసినట్టు ఆమె తెలిపారు. రత్నాపూర్ అంగన్‌వాడీ కేంద్రంను నిర్వహణను మరో అంగన్‌వాడీ టీచర్‌కు ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించనున్నట్టు ఆమె తెలిపారు. పూర్తిస్థాయిలో అంగన్‌వాడీ టీచర్‌ను, ఆయాను నియమించేందుకు కృషి చేస్తామని సీడీపీఓ గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంతోష, కొత్తపేట అంగన్‌వాడీ టీచర్ మన్నెగల్ల రాణి తదితరులు పాల్గొన్నారు.

## వడ్తాల్ బ్రిడ్జి పై నుండి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

ప్రజాపక్షం/ముధోల్ : మండలంలోని వడ్తాల్ వాగుపై ఉన్న బ్రిడ్జిపై నుండి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.రెండు రోజులుగ కురుస్తున్న వర్షాలకు లో లెవెల్ వంతెనపై వర్షపు నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది.దీంతో చుట్టూ పక్కల గ్రామాల వారి రాకపోకలకు అంతరాయం తీవ్ర అంతకామం కలిగింది.విషయం తెలుసుకున్న తహసిల్దార్ వడ్తాల్ వాగును గురువారం పరిశీలించారు.పలు వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.ముధోల్ నుండి అబ్దుల్లాపూర్ వయా లోకేశ్వరం వెళ్లే వాహనదారులు ఈ రోడ్డు వెంట ప్రయాణించవద్దని తహశీల్దార్ సూచించారు.ఇతర రోడ్డు మార్గాలను ఎంచుకోవాలని కోరారు.అలాగే వర్షంతో మండలంలోని బోరిగాం గ్రామంలో తడిసిన,కూలిన ఇండ్లను తహశీల్దార్ పరిశీలించారు.ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందేలా తమవంతు కృషిచేస్తామన్నారు.ఆమె వెంట నాయబ్ తహసీల్దార్ తెలంగ్‌రావు,ఆర్ఐ నారాయణ తదితరులు ఉన్నారు.

## వర్షంతో జనజీవనం అతలాకుతలం

ప్రజాపక్షం/నేరడిగొండ : నేరడిగొండ మండలంలో భారీ వర్షానికి పలు కాలనీలలో వర్షపు నీటితో గృహాలలోకి చేరుకొని పలు ఇండ్లు నీట మునిగి గృహ సామాగ్రి తిండి గింజలు తడిసిపోయి ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారింది.నీట మునిగిన కాలనీలలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్,పర్యటించి ప్రజలను అప్రమత్తం చేస్తూ పలు సూచనలు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎవరు అధైర్య పడొద్దు అని వర్షాలకు బయటకు ఎవరు వెళ్లకుండా స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు.ఆయనతో పాటు మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్,విడిసి అధ్యక్షుడు రవీందర్ రెడ్డి,దేవేందర్ రెడ్డి,నాయకులు తదితరులు ఉన్నారు.

## హై లెవెల్ బ్రిడ్జ్ లేక రెండు గ్రామాల ప్రజలకు ఇబ్బంది

ప్రజాపక్షం/కొల్చారం : మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో మండల వ్యాప్తంగా పొంగి పొర్లుతున్న చెరువు కుంటలు. పోతంశెట్టిపల్లి గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో శిథిలవస్థకు చేరిన పెంకుటిల్లు కూలిపోయాయి. భారీ వర్షం దాటికి పైతర గ్రామంలో ఎల్లుగారి నివాస గృహం కూలిపోయింది. పోతంశెట్టిపల్లి, వెంకటాపూర్ గ్రామాల ప్రజలకు నిత్యవసర సరుకులు కానీ పంట పొలాల వైపు వెళ్లడానికి గ్రామంలో నుండి 765 డి జాతీయ రహదారి వైపు వెళ్లే ప్రధాన రహదారి లో లెవెల్ బ్రిడ్జి వల్ల భారీ వర్షాలతో భారీగా నీరు చేరి పొంగిపొర్లుతుంది దీంతో రెండు గ్రామాల ప్రజలు బయటకు వెళ్లడానికి వీలు లేకుండా రాకపోకలు నిలిచిపోయాయి. వినాయక విగ్రహాలు తేవడానికి ఇబ్బందులు కలిగాయి హై లెవెల్ బ్రిడ్జి వలన ఇబ్బందులు ఉన్నాయని హై లెవెల్ బ్రిడ్జి మంజూరు చేయాలని ప్రభుత్వానికి విన్నవించుకోగా 2024లో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి కొండ సురేఖ హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.